క్లుప్తంగా

కుసుమ హరనాథ బాబా జయంతి వేడుకలు



తెనాలి: పట్టణ గాంధీనగర్‌లోని కుసుమ హరనాథబాబా మందిరంలో బాబా 160వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు హరనాథ బాబాకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం వరకు అత్తోట భజన బృందంచే 'జయ హరనాథ జయ, కుసుమ హరనాథ జయ' అనే నామాన్ని భక్తులచే భజన చేయించారు. శ్రీవెంకటేశ్వర యోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య మాట్లాడుతూ కుసుమ హరనాథ మందిరంలో గత ఆరు దశాబ్దాలుగా పూజలు జరుగుతుందని చెప్పారు. కుసుమ హరనాథబాబు విశిష్టతను తెలియజేశారు. ఆలయ కమిటీ బాధ్యులు పర్యవేక్షణలో పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉచిత వైద్యశిబిరం



తెనాలి: డాక్టర్స్ డే సందర్భంగా పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక డాక్టర్ లతాస్ డయాబెటిక్ కేర్‌లో జరిగిన వైద్యశిబిరంలో ఉదయం 11 గంటల్నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు డాక్టర్ డి.జీవనలత ఉచితంగా వివిధ రకాల పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. అలేఖ్య, జ్యోతి పాల్గొన్నారు.

ఐఎంఏలో డాక్టర్ రామకృష్ణకు నివాళి



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కన్నెగంటి వెంకట రామకృష్ణ సంస్మరణ సభను నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ రామకృష్ణ సేవలను స్మరించుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ ఉమామహేశ్వరావు, డాక్టర్ కొతీతమాను శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ జి. నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

శానిటేషన్ మెరుగునకు చర్యలు తీసుకోండి

ఎస్‌హెచ్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగారావు



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని దానిని మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సెకండరీ హెల్త్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.వి.రంగారావు ఆదేశించారు. తెనాలి జిల్లా వైద్యశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్టర్ సక్రమంగా పనిచేయకపోతే కొత్తవారికి అప్పగించేందుకు కూడా వెనుకాడబోమన్నారు. రోగులకు అందించే డైట్‌ను మెనూ ప్రకారం అందించాలన్నారు. ప్రతి రోజు సంబంధిత అధికారులు దానిని పరిశీలించాలని సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలలో స్టాఫ్ నర్సుల కొరత అధికంగా ఉందన్నారు. గతంలో 60 నుంచి 70 శాతం సీజేరియన్ ద్వారా ప్రసవాలు జరిగాయన్నారు. కానీ నేడు 50 శాతానికి తగ్గించమని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యశాలకు ఏడాదికి రూ.కోటి ఆదాయం సమకూరుతుందన్నారు. వీటితో అత్యాధునిక పరికరాల కొనుగోలు చేసేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. ఆయన వెంట వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా నల్లూరి

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం 2025–26 సంవత్సర నూతన పాలకవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. రోటరీ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షుడిగా నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా గుమ్మడి వెంకట నారాయణ, కోశాధికారిగా వెంపటి హరిప్రసాద్ బాధ్యతలను చేపట్టారు. రానున్న కాలంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమాజ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వీరు తెలియజేశారు. రోటరీ సభ్యులు తమ పూర్తి సహాయ సహకారాలను అందించాలని కోరారు. నూతన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఈనెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఏర్పాటయ్యే సమావేశంలో పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. ఆ కార్యక్రమానికి ఉదయ్ ఫిలిచి డి.జి ఎలెక్ట్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. రోటరీ 1924–25 సంవత్సరానికి అమరావతి రీజియన్‌లో రెండవ ఉత్తమ క్లబ్ అవార్డుతోపాటు 13 రకాల అవార్డులను కైవసం చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. క్లబ్ నాయకులు ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

వివాదాల.. వైద్యశాల!!

- వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన జిల్లా వైద్యశాల
- ఇన్‌చార్జి అనుచిత ప్రవర్తనతో రోడ్డెక్కిన కార్మికులు
- ఆది నుంచీ వివాదాస్పద శైలే!
- ఆందోళనలో వైద్యులు, సిబ్బంది



తెనాలిలోని జిల్లా వైద్యశాల

తెనాలిఅర్బన్: స్థానిక జిల్లా వైద్యశాల వివాదాలకు నిలయంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు తీసుకునే కొన్ని నిర్ణయాలు వివాదాలకు కారణంగా మారుతున్నాయి. వైద్యశాలలోని శానిటేషన్ విభాగ ఇన్‌చార్జిగా ఆస్పత్రిలోని గదికి నిప్పుపెట్టిన కేసులో అరెస్ట్ అయిన వ్యక్తిని నియమించిన నాటి నుంచి అతని ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. పారిశుద్ధ్య కార్మికులను అకారణంగా వేధించటం.. వారిని పరుష పదజాలంతో దూషించటం వంటివి చేస్తున్నారనే నెపంతో కొందరు కార్మికులు రోడ్డు ఎక్కడంతో వివాదం మరింత ముదిరింది. ఇదేమి పరిస్థితి అంటూ అధికారులు తలలు పట్టుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో 200 పడకలు, తల్లిపిల్లల వైద్యశాలలో 100 పడకలు ఉన్నాయి. జిల్లా వైద్యశాలలో ప్రతిరోజు సుమారు వెయ్యి మంది ఓపీ, తల్లి పిల్లల వైద్యశాలలో 90 ఓపీ ఉంటుంది. వీరితో పాటు ప్రతిరోజు రెండు వైద్యశాలల్లో 250 నుంచి 300 మందికి ఇన్‌పేషెంట్‌లు ఉంటారు. వైద్యశాలలో అక్సిజన్ ప్లాంట్‌లు, ఎస్ఎన్‌సీయూ, అధునాతన ల్యాబ్‌లు, వార్డులు ఉంటాయి. వీటన్నింటినీ ఆర్ఎంవో సహకారంతో వైద్యశాల సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తుంటారు. వైద్యశాలలోని శానిటేషన్ బాధ్యతలను ఫస్ట్ అబ్జెక్ట్ సంస్థకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శానిటేషన్ విభాగంలో 55 మంది పారిశుద్ధ్య కార్మికులు, అయిదుగురు సూపర్‌వైజర్‌లు, ఒక ఇన్‌చార్జి పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత టీడీపీ ప్రభుత్వంలో శానిటేషన్ ఇన్‌చార్జిగా పని చేసిన ఆ పార్టీ నాయకుడు నన్నపనేని విజయ సారధి బాధ్యతల్లో చేరారు.

రోడ్డు ఎక్కి.. నినదించిన పారిశుద్ధ్య కార్మికులు

తెనాలి జిల్లా వైద్యశాలలోని శానిటేషన్ విభాగ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న విజయ సారధి తమను పరుష పదజాలంతో దూషించటంతో పాటు అకారణంగా దాడి చేస్తున్నాడనే ఆరోపణతో గత గురువారం కొందరూ కార్మికులు వైద్యశాల ముందు కొద్దిసేపు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. విషయం మీడియా ద్వారా బయటకు రావటంతో గురువారం రాత్రి ఆయన కొందరు కార్మికుల భర్తలకు ఫోన్‌లు చేసి అసభ్యకరంగా వారి గురించి మాట్లాడినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం ఉదయం కార్మికులు భర్తలు కొందరు వైద్యశాలకు వచ్చి విజయసారధితో వాగ్వివాదానికి దిగారు. అంతటితో ఆగకుండా వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు కార్మికులు తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వాహణ అస్తవ్యస్తం

తెనాలి జిల్లా వైద్యశాలలోని పారిశుద్ధ్య నిర్వహణ ఆది నుంచి అస్తవ్యస్థంగా మారింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనల సమయంలో ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశుభ్రంగా ఉంచడం మిగిలిన సమయంలో తూతూ మంత్రంగా చేయడం అక్కడ పరిపాటిగా మారింది. ఈ విషయం ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా వైద్యశాలను చేసిన తనిఖీలో తేటతెల్లమైంది. ఆ సమయంలోనే ఇన్‌చార్జి విజయసారిధిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే జిల్లా వైద్యశాలలో పనిచేసే కార్మికులు ప్రస్తుతం ఇన్‌చార్జికి వ్యతిరేకంగా ఒక వర్గం, అనుకూలంగా మరో వర్గంగా వారు విడిపోయారు. దీంతో రెండు వర్గాల వారు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. కనీసం వార్డులలో కార్మికులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

గతంలో నిప్పు పెట్టిన 'సారధి'

గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ప్రజాప్రతినిధి సూచనతో విజయ సారధిని పారిశుద్ధ్య నిర్వహణ ఇన్‌చార్జిగా అప్పటి కాంట్రాక్ట్ సంస్థ నియమించింది. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. దీనిని మనస్సులో పెట్టుకున్న అతడు 2022 జనవరి 11న జిల్లా వైద్యశాలలోని గదికి నిప్పుపెట్టాడు. దానిలోని పరుపులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. అక్కడే ఉన్న అక్సిజన్ సిలెండర్‌లకు నిప్పు అంటుకోకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ విషయం సీసీ కెమేరాల్లో రికార్డు కావటంతో సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ప్రజాప్రతినిధి అనుమతి లేకుండా అతడిని ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది అతడి ప్రవర్తన చూసి ఆందోళన చెందుతూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వివాదాలకు కారణమవుతున్న వ్యక్తిని విధుల నుంచి తొలగించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైన ఉంది.



గదికి నిప్పు పెట్టడంతో కాలిపోయిన వస్తువులు (ఫైల్)



జిల్లా వైద్యశాల ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

> **ఉన్నతాధికారులకు విన్నవించా**
>
> జిల్లా వైద్యశాలలో కార్మికులు చేసిన ఆందోళన విషయాన్ని ఉన్నతాధికారులకు, కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులకు విన్నవించా. వారి ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపడతా.
>
> – డాక్టర్ సౌభాగ్యవాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

'పొలం పిలుస్తోంది'లో జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజకుమారి



తెనాలి: ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజకుమారి చెప్పారు. సంప్రదాయ వ్యవసాయాన్ని ఆచరించేవారితో సమానమైన దిగుబడిని ప్రకృతి రైతులు పొందుతున్నారని చెబుతూ ఆ విధానంలో పండించిన ధాన్యంలో అధిక పోషక సాంద్రత ఉంటుందన్నారు. నేల ఆరోగ్యం, మనిషికి పోషకాహారం కోసం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులు అనుసరించాలని సూచించారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రాజకుమారి పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజను ఆరంభించే ముందు 'ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానం అనుసరించటం మంచి పద్ధతిగా చెప్పారు. 30 రకాల ధాన్యాలు అంటే పప్పు ధాన్యాలు, ధాన్యాలు, పచ్చిరొట్ట జాతి, నూనె జాతుల విత్తనాలు, తీగెజాతి విత్తనాలు, చిరుధాన్యాలు, ఆకుకూర విత్తనాలు, కూరగాయ విత్తనాలను కలిపి పొలంలో వేసుకోవాలని చెప్పారు. నేల ఆరోగ్యం, పోషకాల నిర్వహణ కోసం జీవామృతం, బీజామృతాలను వాడుకోవాలని, పురుగు, తెగుళ్ల యాజమాన్యం కోసం నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి వినియోగించాలని చెబుతూ వాటి తయారీ గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు ముందుగా విత్తనశుద్ధి చేసి వెదసాగును చేపట్టాలని సూచించారు. రైతులు భూసార పరీక్ష అనుసరించి ఎరువులు వినియోగించాలని సూచించారు. ఉద్యాన పంటలపై సంబంధిత అధికారి మాట్లాడారు. అభ్యుదయ రైతులు, ఆదర్శ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్.. క్లిన్..కవర్‌తో దోమల నియంత్రణ

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: చెక్.. క్లిన్.. కవర్ విధానంతో దోమల పుట్టుకను, వాటి వృద్ధిని నియంత్రించవచ్చని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు అవగాహన కార్యక్రమాలను వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ ఏడీస్ ఆడ దోమ కుట్టడం వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని తెలిపారు. ఇది ఒకరినుంచి ఒకరికి సోకే అవకాశం ఉందన్నారు. దోమలు నీటి నిల్వల్లో గ్రుడ్లు పెట్టి సంతతిని వృద్ధి చేసుకుంటాయని తెలిపారు. గ్రుడ్డు దోమగా మారడానికి 8 నుంచి 10 రోజులు పడుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. నీటి నిల్వలు ఉన్న వస్తువులపై మూతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్వా యేసుబాబు మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు వేయడం వలన నీటి ప్రవాహం నిలిచిపోయి దోమల వృద్ధి పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంటిలో ఉత్పత్తి అయిన చెత్తను తడి, పొడి హానికర చెత్తలుగా విభజించి మున్సిపల్ కార్మికులకు అందజేయాలని సూచించారు. నందులపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ వైద్యశాల, అర్బన్ హెల్త్ సెంటర్‌లో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, గుంటూరు, తెనాలి సహాయ మలేరియా అధికారులు దరవత్ రాజు నాయక్, చిరసాని ప్రభాకర్‌రెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, డాక్టర్ పాల్‌రాజు నర్సింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల వాహనాల తనిఖీ



వాహన వివరాలను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు

తెనాలిరూరల్: వేసవి సెలవుల అనంతరం విద్యా సంస్థలు పునః ప్రారంభం కావడంతో ఆయా సంస్థల వాహనాలను రవాణా శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి. రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృతవాణి నేతృత్వంలో నిర్వహించిన తనిఖీలలో పత్రాలు సరిగాలేని వాహనాలపై ఆరు కేసులు నమోదు చేసి, రూ.17 వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలని, వాహనాల పత్రాలు, డ్రైవర్ లైసెన్స్ తదితరాలు వాహనాల తనిఖీ సమయంలో అందుబాటులో ఉండాలని, నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీలలో రవాణా శాఖ హోంగార్డులు పాల్గొన్నారు.

• వేళ్లాడుతున్న విద్యుత్ వైర్లు





ప్రగడ కోటయ్య నగర్‌లో ఆరో లైను ఎదురుగా రెండో లైనులో కరెంటు 3 ఫ్లస్ సర్వీస్ వైర్లు బాగా దిగువకు వేలాడుతున్నాయి. అక్కడి ఇంటి గేటుకు తాకుతున్నట్టుగా ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జగ్గడిగుంట పంచాయతీ పరిధిలోని సచివాలయంలో దీనిపై అర్జీ ఇచ్చి ఆరునెలలు గడిచాయి. విద్యుత్ లైన్‌మేన్‌కు, గ్రామ సర్పంచ్‌కు తెలియజేసినా ఇంతవరకు తమ సమస్య పరిష్కారం కాలేదని స్థానికుడు బి.పూర్ణచంద్రరావు విలేకరులకు వాపోయాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. – తెనాలి

సుభాషిణి మృతదేహానికి పోస్ట్‌మార్టం

- డబుల్ మర్డర్ కేసు నిందితుల చేతిలో హత్యకు గురైన మరో మహిళ
- పోలీసుల విచారణలో నిందితులు ఒప్పుకోవడంతో వెలుగులోకి!
- మల్లెపాడులో మృతదేహాన్ని వెలికితీసి నమూనాలు సేకరించిన ఫోరెన్సిక్ బృందం



సుభాషిణి (ఫైల్)



సుభాషిణి మృతదేహం ఉన్న పెట్టెను బయటకు తీసిన సిబ్బంది

తెనాలిరూరల్: ఇటీవల ఇరువురు మహిళల హత్య కేసులో నిందితులు తాము మరో మహిళనూ హత్య చేసినట్టు మధ్యవర్తుల సమక్షంలో అంగీకరించడంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. తహసీల్దార్, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం జూన్ 19న పరిమిరోడ్డులో నివసించే దాసరి రాజేశ్వరి, పిటా అంజమ్మలు హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ హత్య కేసులో పోలీసులు ఈనెల 23న నిందితులైన పెరవలి (అత్తోట) కుసుమ కుమారి, ఇళ్ల గోపికృష్ణ, షేక్ అబ్దుల్ కలాం (మైనర్)ను అరెస్టు చేశారు. అరెస్ట్ సందర్భంలో విచారణలో ఇదే తరహాలో మరో మహిళ మారిస్ పేటలో కుసుమ కుమారి ఇంటి ఎదురు రోడ్డుకు ఆవలి వైపున ఒంటరిగా నివసిస్తున్న చావలి సుభాషిణిని హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వీఆర్‌వో సమక్షంలో నిందితులు నేరాన్ని ఒప్పువడంతో ఆయన నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు లీగల్ ఒపీనియన్‌కు పంపారు. కోర్టు నుంచి అనుమతులు రావడంతో తహసీల్దార్ ద్వారా ఫొరెన్సిక్ విభాగానికి లేఖ రాశారు. ఈ క్రమంలో సుభాషిణి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు మంగళవారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో మల్లెపాడు గ్రామంలో మృతురాలి సమాధిని తవ్వించారు. గుంటూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ సుజ్ఞాన్ కుమార్ బృందం మృతదేహాన్ని పరీక్షించి కొన్ని శాంపిళ్లను సేకరించారు.

ఆప్తురాలిగా ఉంటూ.. అంతమొందించింది!

సుభాషిణికి ముగ్గురు కుమార్తెలు. వారు వివాహాలై వేరు వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. సుభాషిణి ఇంటి ఎదురుగానే నిందితురాలు కుసుమకుమారి నివాసం కూడా. మృతురాలితో కుసుమకుమారి బాగా సన్నిహితంగా ఉండేది. ఏదైనా అవసరమైతే ఇంట్లో చిన్నపాటి పనులు కూడా చేసేది. ఇద్దరూ కలసి బజారుకూ వెళుతుండే వారు. తమ తల్లికి చేదోడు వాదోడుగా ఉండాలని కుమార్తెలు కుసుమ కుమారికి చెబుతుండే వారు. మే నెల 22, 23 తారీకులలో సుభాషిణి స్వల్ప అస్వస్థతకు గురైంది. ఫోనులో సమాచారం తెలుసుకున్న రెండో కుమార్తె, అల్లుడు ఆమెకు కావలసిన మందులు పంపించారు. 24న రాత్రి కూడా కుమార్తె, అల్లుడు సుభాషిణితో ఫోనులో సంప్రదించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని కుదుటపడ్డారు. 25 ఉదయం తిరిగి సుభాషిణికి కుమార్తె ఫోన్ చేయగా స్పందన లేదు. వెంటనే సన్నిహితంగా ఉండే కుసుమ కుమారికే వారు ఫోన్ చేసి వెళ్లి చూడాల్సిందిగా పురమాయించారు. కొద్దిసేపటికి కుసుమ కుమారి తిరిగి ఫోన్ చేసి సుభాషిణి అచేతనంగా పడి ఉందని ఫోన్‌లోనే పెద్దగా ఏడ్చి, హైరానా చేసింది. వెంటనే కుమార్తెలు బంధువులు వచ్చి చూసి సుభాషిణి మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని ఆమె భూస్థాపన కార్యక్రమం మల్లెపాడు సమాధులలో మర్నాడు పూర్తి చేశారు. ఒంటిపై ఉన్న బంగారం కనిపించకపోవడంతో వెతుక్కునే పనిలో ఉన్నారే కానీ మృతిని అనుమానించలేదు. వాస్తవానికి సుభాషిణి ఒంటరిగా ఉండటం, ఆమె వద్ద నగలు ఉండటాన్ని గమనించి వాటిని అపహరించేందుకు పథకం వేసిన కుసుమ కుమారి, గోపీకృష్ణ, షేక్ అబ్దుల్ కలాంతో కలిసి మే నెల 25న తెల్లవారుజామున సుభాషిణిని అంతమొందించింది. ఏమీ ఎరుగనట్లు ఆమె బంధువులను పలకరించడం, ఇంటిలో పనులు చేయడం, తదుపరి నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొంది. కానీ తాజాగా జరిగిన జంట హత్యల నేపథ్యంలో పోలీసుల తమదైన శైలిలో విచారణ నిర్వహించగా సుభాషిణిని తామే హత్య చేసినట్లు మధ్యవర్తుల సమక్షంలో నిందితులు ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఫోరెన్సిక్, పోస్టుమార్టం నివేదిక రాగానే నిందితులపై తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. మొత్తానికి కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకుండా హత్య చేసిన మహిళే మృతురాలి బంధువులకు తాగునీరు, టీ కాఫీలు అందించడం, ఆ కుటుంబ సభ్యులతో అత్యంత సన్నిహితంగా మెలగడాన్ని మృతురాలి కుటుంబ సభ్యులు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే నిందితులు ముగ్గురు డబుల్ మర్డర్ కేసులో రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

వైద్యుల భాగస్వామ్యం అభినందనీయం

డాక్టర్స్‌డేలో రోటర్‌క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్



సత్కారం అందుకున్న వైద్యులతో క్లబ్ బాధ్యులు

తెనాలి: పవిత్రమైన వైద్యవృత్తిలో కొనసాగుతున్న వైద్యులు రోటరీ క్లబ్ ద్వారా సమాజసేవలోనూ భాగస్వాములు కావటం సంతోషకరమని రోటర్‌క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డేను నిర్వహించారు. రోటరీ క్లబ్‌లో సభ్యత్వం కలిగి, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న వైద్యులను క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. రోటరీ సీనియర్ సభ్యుడు డాక్టర్ డి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమకు అవకాశం కల్పించిన రోటరీ బాధ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

డాక్టర్ డి.రవీంద్రనాథ్‌తోపాటు డాక్టర్ కె.శరత్‌రాజ్, డాక్టర్ డి.జీవనలత, డాక్టర్ తలశిల రాకేష్, డాక్టర్ చందు ఉదయ్ భాస్కర్‌ను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయన, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, రొటేరియన్లు జి.వెంకటరత్నం, కె.మురళీకృష్ణ, చేతన్‌రాజ్, ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, కిరణ్, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, నరేంద్ర, జగదీశ్వరాంబ, గుమ్మడి ప్రసాద్, కిషోర్, రమేష్, అర్జున తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..



డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ సంయుక్త, డాక్టర్ విజయలక్ష్మిలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తెనాలిఅర్బన్: ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని విజయలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో మంగళవారం వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ సంయుక్తలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ వెలగా శరత్ బాబు, అధ్యక్షులు యక్కల రామమోహన రావు, వెలగా నిర్మల, అలపర్తి రామమోహనరావు, బ్రహ్మం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.